క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారంపేట, కేస న్నపల్లె, ఆరెపల్లి, గుండారం, కిష్టాపూర్, గ్రామాల ప్రజలు కంటి పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చింతల ప్రభాకర్, సరళ, కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్, ప్రభాకర్ రెడ్డి, నాగేషు, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కార్యవర్గం

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామగౌడ సంఘం అధ్యక్షుడిగా ముష్కం రాజయ్య ఎన్నికయ్యారు. గురువారం సమావేశమైన సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జవ్వాజి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా గుండా మహేశ్ గౌడ్, కార్యదర్శిగా గుండా తిరుపతిగౌడ్, కార్యవర్గ సభ్యులుగా ముష్కం శ్రీకాంత్, బాలసాని రాజు, ముష్కం శ్రీనివాస్, తాళ్లపెల్లి మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోషకాహారం తీసుకోవాలి

తంగళ్లపల్లి: మహిళలు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీవో ఉమారాణి అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని అంగన్‌వాడీలో మహిళలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ అంజలి, అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, శోభ,లత, శారద తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం మారుపాక రైతు వేదికలో అర్బన్ మండల సెక్టార్ అంగన్‌వాడీల పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ప్రీస్కూల్ పిల్లలకు అక్షరభ్యాసం చేసినట్లు తెలిపారు. సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ అంజమ్మ, రాజు కుమార్, దేవిక, సాయిరాం, తదితరులు ఉన్నారు.

నవంబర్ 30లోపు కవితలు పంపాలి

ముస్తాబాద్: గడుగ్గాయి కవితలు, కథల పోటీలకు బాలల నుంచి రచనలు ఆహ్వానిస్తున్నారని బాలసాహితీ వేత్త గరిపెల్లి అశోక్ తెలిపారు. గడుగ్గాయి పిల్లల మాస పత్రిక కోసం సంక్రాంతికి రచనలు తీసుకుంటున్నారన్నారు. నవంబర్ 30లోగా చిన్నారులు తమ కథలు, కవితలను పంపించాలన్నారు.18 ఏళ్లలోపు చిన్నారులంతా కథలు, కవితలు, వ్యాసాలు పంపించవచ్చన్నారు. గడుగ్గాయి మెయిల్‌కు తమ రచనలు పంపించాలని కోరారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో కథలు, కవిత పోటీలు నిర్వహిస్తున్నారన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల అర్బన్: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కుసుమ రామయ్య జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన జే.సంతోష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్ తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు వచ్చేనెలలో భద్రాది కొత్తగూడెం జిల్లాలో జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా సంతోష్‌ను ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

వృథాగా 'భగీరథ' నీరు



బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ నుంచి బోయినపల్లి వెళ్లే రోడ్డులో వరద కాలువ పక్కన ఓ రైతు పొలంలో మిషన్ భగీరథ ఎయిర్ వాల్ నిర్మించారు. చాలా రోజులుగా ఎయిర్ వాల్ లీకై నీరంతా వృథాగా పోతోంది. రైతు వరి కోయకముందు లీకేజీ నీరు పంటకు అందేది. ఇప్పుడు వరికోతకు రావడంతో లీకేజీ నీరు బయటకు వెళ్లేందుకు పొలం నుంచి రోడ్డు మీదుగా కాలువ తీశాడు. దీంతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుంది.అధికారులు చొరవ తీసుకుని లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడిపై హత్యాయత్నం

ఇల్లంతకుంట: హత్యాయత్నం కేసులో ఒకరిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల సీఐ మొగిలి తెలిపారు. కందికట్కూర్‌కు చెందిన జక్కుల శ్రీనివాస్, నక్క రవి మధ్య డబ్బుల విషయంలో కొంతకాలంగా గొడవ జరుగుతుండగా పంచాయతీ కూడా నిర్వహించారు. విసిగిపోయిన నక్క రవి గురువారం జక్కుల శ్రీనివాస్‌పై కత్తితో దాడిచేసి గాయపర్చాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నక్క రవిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇరుకు వంతెనలతో ఇక్కట్లు



నిమ్మపల్లి శివారులో ఇరుకు వంతెన



కనగర్తి - సుద్దాల మధ్య వంతెన

- మండలంలోని పలు గ్రామాల్లో రాకపోకలకు వాహనదారుల తిప్పలు
- ఎదురుగా వాహనం వస్తే మరొకటి వెళ్లలేని పరిస్థితి
- పట్టించుకోని అధికారులు

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వంతెనలు ఇరుకుగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

పెద్దసంఖ్యలో రాకపోకలు

మండలంలోని నిమ్మపల్లి నుంచి మూలవాగు ప్రాజెక్టు, మరిమడ్లకు వెళ్లేదారిలో ఉన్న వంతెన ఇరుకుగా మారింది. ఈ వంతెన మీదుగానే మరిమడ్లతో పాటు నిజామాబాద్ జిల్లాకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. దీంతో రోజూ ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఈ దారి గుండా వెళ్తుంటాయి. ప్రాజెక్టు వద్ద ఉన్న వంతెన ఇరుకుగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది మారింది. కనగర్తి నుంచి సుద్దాలకు వెళ్లేదారిలో ఉన్న వంతెన ఇరుకుగా తయారైంది. ఈ దారిగుండా రోజూ కోనరావుపేట, వేములవాడ తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. వంతెన వద్ద ఎదురుగా వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వీటితో పాటు వట్టిమల్ల, ధర్మారం, రామన్నపేట తదితర గ్రామాల్లో వంతెనలు ఇరుకుగా ఉన్నాయి.

రాకపోకలకు తిప్పలు



మండలంలోని కనగర్తి నుంచి సుద్దాల గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వంతెన చిన్నదిగా మారింది. ఈ దారి గుండా రోజూ వేములవాడ, కరీంనగర్, కోనరావుపేట తదితర ప్రాంతాలకు అధికసంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. కనగర్తి శివారులో ఉన్న వంతెన వద్ద రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – వంగపెల్లి భూపతి, కనగర్తి

అధికారులు పట్టించుకోవడం లేదు



మండలంలోని నిమ్మపల్లి నుంచి మరిమడ్లకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వంతెన ఇరుకుగా మారింది. ఈదారి గుండా మరిమడ్లతో పాటు నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్ తదితర ప్రాంతాలకు వాహనాలు వెళ్తుంటాయి. కొన్నేళ్లుగా ఈ వంతెనను ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రవాణా సమస్యలు పరిష్కరించాలి. – దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్, నిమ్మపల్లి

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు



తంగళ్లపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్



గంభీరావుపేట : ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

తంగళ్లపల్లి: రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని భరత్ నగర్, ఇందిరానగర్, రాములబండ, మల్లాపూర్, దేశాయిపల్లి, సారంపల్లి, బద్దెనపల్లి, బస్వాపూర్, బాలమల్లుపల్లి, నర్సింహులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగం, ఏపీఎం రజిత, సత్తు శ్రీనివాస్ రెడ్డి, మునిగెల రాజు, తిరుపతి, రాములు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ సవేరా బేగం అన్నారు. బుగ్గరాజేశ్వర తండా, అల్మాస్‌పూర్, రాజన్నపేట, బాకుర్‌పల్లి తండా, బొప్పాపూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, తహసీల్దార్ సుజాత, వైస్ చైర్మన్ గుండాడి రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట, సముద్ర లింగాపూర్, నర్మాలలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, ఏపీఎం దేవరాజు, ఏఎంసీ చైర్మన్ విజయ, హమీద్, రాజిరెడ్డి, పర్శరాములు, రాజారాం, సీసీలు పాల్గొన్నారు.

వంతెనలు నిర్మించాలి



చందుర్తి: మండలంలోని ఎన్గల్‌లో వంతెనల నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ ప్రజా గొంతుక చీఫ్ పుప్పాల మోహన్, గౌడసంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పాఠశాల సమీపంలో ఉన్న వాగుతో ఏటా వర్షాకాలంలో పెద్దమ్మ, రేణుకా ఎల్లమ్మ ఆలయాలకు వెళ్లే భక్తులతో పాటు, గీత కార్మికులు, రైతులు , కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. నెల రోజులుగా నిరసన తెలిపినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వంతెన నిర్మాణాలను చేపట్టాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతి

గంభీరావుపేట: కొనుగోలు కేంద్రాలనుంచి ధాన్యాన్ని తరలించేందుకు స్థానిక ట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు గంట శ్రీనివాస్ అధికారులను గురువారం కోరారు. ఈమేరకు తహసీల్దార్ మారుతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో రెండురోజులుగా విద్యుత్ మరమ్మతు పనుల పేరుతో సరఫరాను తరచూ నిలిపివేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పాటు రాత్రి సమయంలో దోమలతో ఇబ్బంది పడుతున్నామని వినియోగదారులు తెలిపారు. వెంటనే విద్యుత్ మరమ్మతు పనులు పూర్తిచేసి ఇబ్బంది లేకుండా చూడాలని సెస్ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు

వేములవాడ: బెదిరింపులకు పాల్పడుతున్న పీడీఎఫ్ పత్రికలో పనిచేసే ఇద్దరు రిపోర్టర్లపై కేసు నమోదు చేసి ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేములవాడ పరిధి అగ్రహారానికి చెందిన బొమ్మెల మహిపాల్ ఒగ్గు కళాకారుడు. పీడీఎఫ్ పత్రికలో పనిచేసే పట్టణానికి చెందిన తొగరి కరుణాకర్ ఈనెల 11న మహిపాల్‌కు ఫోన్‌చేసి వేములవాడకు రావాలని, లేకపోతే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నాడు. దీంతో మహిపాల్ వేములవాడకు వచ్చి కరుణాకర్‌ను కలిశాడు. ఎందుకు తనపై ఫిర్యాదు చేస్తావని కరుణాకర్‌ను ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పాడు. మరుసటి రోజు కరుణాకర్ మరోసారి ఫోన్‌చేసి నువ్వు ఒకరిని మోసం చేశావు, పత్రికల్లో వేయకుండా ఉండాలంటే మరో రిపోర్టర్ రాజుకు రూ. 30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో భాయందోళనకు గురైన మహిపాల్ ఈనెల 14న ఫోన్‌పే ద్వారా రూ.10వేలు పంపాడు. అయినా కరుణాకర్ మరో రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. విసిగిపోయిన మహిపాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. కరుణాకర్‌ను రిమాండ్‌కు తరలించగా రాజు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా బాధితులుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

ఇద్దరి రిమాండ్

కోనరావుపేట: అటవీ అధికారులపై దాడిచేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మండల అటవీ బీట్ అధికారిగా పనిచేస్తున్న కొంగర సుదర్శన్, సెక్షన్ అ ధికారి శ్రీనివాస్, సిబ్బంది దప్పుల బలరాం మరి మడ్ల అటవీప్రాంతంలో గస్తీ తిరుగుతున్న సమయంలో మరిమడ్లకు చెందిన కడకుంట్ల విజయ్, చెలిమల ప్రవీణ్ ఏకలవ్య పాఠశాల సమీపంలో మ ద్యం తాగుతూ అధికారుల విధులను అడ్డుకున్నా రు. బీట్ అధికారి సుదర్శన్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రిజర్వేషన్లు సాధించే వరకూ ఉద్యమం



మాట్లాడుతున్న సురేశ్

ముస్తాబాద్: విద్య, ఉద్యోగ, ఉపాధిలతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు సాధించుకునే వరకు బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉద్యమం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఇడుగురాళ్ల సురేశ్, జిల్లా అధ్యక్షుడు కొండ యాదగిరి అన్నారు. గురువారం ముస్తాబాద్‌లో బీసీ నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా బీసీలందరూ ఐక్యంగా ఉండి ఉద్యమం చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతమే కాదు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కావాలని తెలిపారు. ఈనెల18న తలపెట్టిన తెలంగాణ బంద్‌ను స్వచ్ఛందంగా పాటించాలని కోరారు. సమావేశంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, శీలం స్వామి, జేఏసీ నాయకులు గజ్జెల రాజు, తోట ధర్మేందర్, కామిటికారి పద్మ, గుండెల్లి శ్రీను, కోల కృష్ణ, గూడూరి భరత్, ప్రశాంత్, గీస భిక్షపతి, మల్లేశ్, భాను, సత్యం, మల్లేశ్, వెంకటేశ్, సత్తయ్య గౌడ్, బాలెల్లు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



కోనరావుపేట: మాట్లాడుతున్న వైద్యాధికారి వేణుమాధవ్

చందుర్తి: సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని చందుర్తి , రుద్రంగి అంబులెన్స్ ఈఎన్‌టీలు మాలవత్ గణేశ్, వెంకటరమణ అన్నారు. గురువారం చందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు తక్కల్ల లచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి వేణుమాధవ్ సీపీఆర్‌పై వివరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్‌సూరత్ యాదవ్, సూపర్‌వైజర్ రషీద్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ్‌చందు, హెల్త్ అసిస్టెంట్ సవాయి లాల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల కమిటీ ఎన్నిక



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల నూతన కమిటీని గురువారం నియమించినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా కడారి రాములు, ముఖ్య సలహాదారుగా అజ్జ వేణు, అధ్యక్షుడిగా డప్పు చంద్రకళ, ఉపాధ్యక్షులుగా దొబ్బల రేణుక, ఆరెల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వడ్లూరి కేతవ్వ, సహాయకార్యదర్శిగా మునుగు ప్రమీల, కార్యదర్శులుగా పెంట లక్ష్మి, లైన్ నిర్మల, కోశాధికారిగా మండల లీల, కౌన్సిల్ సభ్యులుగా సంద్రగిరి విజయ, చింతల అనసూర్య, బొడ్డు కాసవ్వ, కట్కూరి అంజవ్వ, తాళ్లపెల్లి లచ్చవ్వ, నేదూరి బాబాయ్, ఏర్ల రజిత, కోనేటి రాజేశం, గంగాధర శంకరవ్వ, ఎదురుగట్ల లక్ష్మి, నేదూరి శోభ, పెంట లక్ష్మినారాయణ, గుడిసె రాజమణి, నేదూరి లక్ష్మి, దేవరాజేశ్వరి, రామయ్య, బుర్ర రాజును ఎన్నుకున్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



చందుర్తి: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని జోగాపూర్ శివారులో గురువారం పట్టుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. అణుగుల దేవరాజ్, రత్నం సంజీవ్‌ను ప్రశించి వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ..

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేట పరిధిలోని మానేరువాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్ సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.



సిరిసిల్ల: పట్టణంలోని శాంతినగర్ నుంచి శ్రీనగర్‌కాలనీకి వెళ్లే 60 ఫీట్ల రోడ్డుకు ఇటీవల మున్సిపల్ అధికారులు ఒకవైపు మాత్రమే మొరంపోసి వదిలేశారు. దీంతో రెండో వైపు రోడ్డుపై గడ్డి మొలిచింది. మొరం లేక రోడ్డు అలాగే గడ్డితో ఉంది. ప్రధానమైన రోడ్డును మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా వదిలేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మొరంపోసి మరమ్మతులు చేపట్టాలని శాంతినగర్, శ్రీనగర్‌కాలనీ వాసులు కోరుతున్నారు. – మదుపు ప్రవీణ్‌కుమార్, శాంతినగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
మున్సిపల్ కమిషనర్, ఖదీర్ పాషా, సిరిసిల్ల, సెల్ : 98499 05879

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బంద్‌కు సహకరించాలి



సిరిసిల్ల టౌన్ : అభివాదం చేస్తున్న బీసీ నేతలు

సిరిసిల్లటౌన్: బీసీలకు రెండుశాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, అఖిల పక్ష నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేకు వ్యతిరేకంగా ఈనెల 18న చేపట్టే రాష్ట్ర బంద్‌కు జిల్లాలోని అంబేద్కర్ సంఘాలు, అన్ని బీసీ కులసంఘాలు, ఎమ్మార్పీఎస్, అన్ని రాజకీయ పార్టీలు పాల్గొంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మిగతా విద్యాసంస్థలు, ఆర్టీసీ, హోటల్స్ అన్ని వ్యాపార సంస్థలు మూసివేసి బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు సాధించుకునే వరకు జేఏసీగా ఏర్పడి పోరాటం చేయాలని సమావేశంలో తీర్మానించారు, జేఏసీ ప్రతినిధులు కత్తెర దేవదాస్, బొజ్జ కనకయ్య, బొప్ప దేవయ్య, చొక్కాల రామ్, భిక్షపతి, మల్లేశం, అంజయ్య, నాయకులు తడుక కమలాకర్, కందుకూరి రామాగౌడ్, బండారి బాల్‌రెడ్డి, బోయిన శ్రీనివాస్, తోట్ల మల్లేశం యాదవ్ ,కంచర్ల రాజు, చొక్కి కైలాసం, తిరుపతి, కుసుమ ప్రభాకర్, బూర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు బీసీటీఏ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం జరుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు పులిరామ్‌గోపాల్ గౌడ్, కృష్ణహరి, మల్లేశం తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 18న మండలవ్యాప్తంగా బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. మండల బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి పీఠాధిపతికి ఘనస్వాగతం పలుకుదాం



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: ఈనెల 19న వేములవాడకు వస్తున్న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామికి బీజేపీ తరఫున ఘన స్వాగతం పలకడానికి తరలిరావాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్‌లు అన్నారు. గురువారం వేములవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సనాతన ధర్మ పరిరక్షకులు, దేశంలో నాలుగు పీఠాలను స్థాపించి సంరక్షిస్తున్న దైవ సమానులు విధుశేఖర భారతి స్వామి ధర్మ విజయ యాత్రలో భాగంగా శంకరమఠం అభినవ విద్యాతీర్థ సదనం బ్రాహ్మణ నిత్యాన్న సత్రంలో జరిగే కుంభాభిషేకానికి వస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రేగుల మల్లికార్జున్, కృష్ణస్వామి, బండ మల్లేశం, వెంకటేశం, సంటి మహేశ్, పిన్నింటి హన్మండ్లు, నామాల శేఖర్, గుంటి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడులు కొనసాగితే ఉద్యమాలు చేపడుతాం



మాట్లాడుతున్న కత్తెర దేవదాస్, వివిధ సంఘాల నాయకులు

సిరిసిల్ల అర్బన్: బీజేపీపాలిత రాష్ట్రాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతున్న దమనకాండను ఖండిస్తున్నట్లు అంబేద్కర్ సంఘాల జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. హర్యానాలో ఐపీఎస్ ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై ఎక్కడో ఓ చోట దాడులు తరుచూ జరుగుతున్నాయన్నారు. ఇలాగే దాడులు కొనసాగితే ఉద్యమాలు చేపడుతామన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, సెస్ డైరెక్టర్ సుధాకర్, నాయకులు ప్రభాకర్, లక్ష్మణ్, పర్శరాములు, చొక్కాల రాము, అన్నల్‌దాస్ భాను, గడ్డం కిరణ్, త్యాగరాజు, మల్లేశం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

చందుర్తి: పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఇసుక అ క్రమ రవాణాదారులు పత్తిపంటను ధ్వంసం చేశారని వారిపై చర్యలు తీసుకో వాలని రైతులు కోరుతున్నారు. ఎన్గల్ రెవెన్యూ పరిధిలో భూములున్న వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన నాంపెల్లి నవీన్, తీపిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చందుర్తి మండలం మూడపల్లికి చెందిన రాచర్ల రామస్వామి అనే రైతుల పంట చేలనుంచి ఇసుకను తీపిరెడ్డి సుధాకర్‌రెడ్డి చేనులో ఆన్‌లోడ్ చేసి తప్పించుకున్నట్లు తెలిసింది. ఎన్గల్, మర్రిగడ్డ, హన్మాజిపేట మూడు గ్రామాల శివారు మధ్యలో ఉన్న ఒర్రెల్లో ఉన్న ఇసుకను ట్రాక్టర్ యాజమానులు లోడ్ చేశారు. అంతలోనే పోలీసుల రాకను పసిగట్టి ఇసుక రవాణాదారులు పంటచేనులో ఇసుక డంప్ చేశారు. పత్తి చేనులోంచి ట్రాక్టర్ వెళ్లడంతో పంటం ధ్వంసమైందని, పోలీసులు వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలన

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో లచ్చాలు పరిశీలించారు. ప్రధాని ఆవాస్ యోజన సాయంతో నిర్మిస్తున్న లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తిచేయాలన్నారు. పనులు మొదలు పెట్టని వారు ప్రారంభించాలని సూచించా రు. ఏఈ మనీష్ ఉన్నారు.